## కమిషనర్‌తో ఎమ్మెల్యే భేటీ



అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. బుధవారం కమిషనర్ తో ఎమ్మెల్యే భేటీ అయి నియోజకవర్గంలో పెండింగ్ పనులపై చర్చించారు.

- మెహిదీపట్నం

## ఎమ్మెల్యే పర్యటన



ముంపు సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నానల్‌నగర్ డివిజన్‌లోని బుల్కాపూర్ నాలాను పరిశీలించారు. డ్రైనేజీ, సీవరేజీ లైన్ల నిర్మాణాలు, నాలా పూడికతీత పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

- మెహిదీపట్నం

# నెల రోజులుగా మురుగుతో సావాసం

- డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో ఇండ్ల ఎదుటే నిలుస్తున్న మురుగునీరు
- నల్లకుంట సత్యానగర్‌లో ఇదీ దుస్థితి
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అంబర్‌పేట, జూన్ 26 : నల్లకుంట డివిజన్ సత్యానగర్ వాసులు మురుగు సమస్యతో నిత్యం సతమతమవుతున్నారు. ఇండ్ల ఎదుట మురుగునీరు నిలువడంతో వెలువడే దుర్వాసనను భరించలేకపోతున్నారు. తాగునీరు కూడా కలుషితమై వస్తుండడంతో 10 రోజుల నుంచి నల్లాల్లో వచ్చే నీటిని బస్తీవాసులు తాగ లేకపోతున్నారు. బయటి నుంచి మినరల్ వాటర్ కొనుక్కోని తాగుతున్నారు. చెప్పాలంటే నెల రోజులుగా మురుగుతోనే సావాసం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. నల్లకుంట డివిజన్ సత్యానగర్ ఇం.నెం.3-4-978 ఎం.సత్తమ్మ, భూపాల్ నిలయం ఎదురు గల్లీ (స్థానిక కమ్యూనిటీ హాల్ వెనుక గల్లీ)లో నెల రోజుల నుంచి డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతున్నది. ఆ బస్తీ నుంచి వెళ్లే డ్రైనేజీ పైపు లైన్ ఎక్కడో జామ్ అయింది. దాన్ని సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారుల క్లియర్ చేయడం లేదు. గతంలో ఒకటి, రెండు సార్లు ఇలాగే సమస్య వస్తే సిబ్బంది వచ్చి తాత్కాలికంగా డ్రైనేజీ సమస్యను క్లియర్ చేశారు. మళ్లీ ఇప్పుడు అదే సమస్య రిపీట్ అయింది. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్ని ఫిర్యాదులు చేసినా వారు రావడం లేదని బస్తీవాసులు పేర్కొన్నారు. మురుగునీటిలోనే తాము నివసిస్తున్నామని, అందులో నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని వాపోతున్నారు. చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన అంతంత మాత్రమే ఉంటున్నారు. మురుగు సమస్య నుంచి తమను కాపాడాలని వేడుకొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ పొంగడంతో ఇండ్ల నడుమ నిలిచిన మురుగునీరు



నల్లకుంట సత్యానగర్‌లో ఇండ్ల ఎదుట నిలిచిన మురుగునీరు

## సైఫాబాద్ కళాశాల అభివృద్ధికి నిధులు విడుదల

సుల్తాన్‌బజార్, జూన్ 26 : ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల అయిన సైఫాబాద్ సైన్స్ కళాశాల అభివృద్ధికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ దాన కిశోర్ ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలను బుధవారం సందర్శించిన దాన కిశోర్ పరిస్థితితులను సమీక్షించిన అనంతరం నూతన డ్రైనేజీ లైన్ పనులకు పది లక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడి నిధులను విడుదల చేయించారు. బాయ్స్ హాస్టల్, ఓపెన్ జిమ్, గర్ల్ హాస్టల్‌లో ల్యాండ్ స్కేపింగ్‌ల ఆధునీకరణకు గాను మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి నిధులను విడుదల చేయించారు. బోటానికల్ గార్డెన్ అభివృద్ధికి రూ.95 లక్షలను హెచ్ఎండీఏ నుంచి విడుదల చేసి తన కళాశాల సిబ్బంది, విద్యార్థుల అభినందనలు అందుకున్నారు.





మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీని బుధవారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి పార్లమెంట్ భవనంలో ప్రధానిని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

- ముషీరాబాద్

## ఎమ్మెల్యేను కలిసిన గోవిందునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



గోల్నాక డివిజన్ గోవిందు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మె ల్యే కాలేరు వెంకటేశ్ ను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ చైర్మన్ కంబర్తి ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావుయాదవ్, ప్రధాన కార్యదర్శి కుయ్యా అరుణ్‌దాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సెట్ల గోపాల్, ఉపాధ్యక్షులు బొమ్మరాజు ఈశ్వర్, కోశాధికారి సెట్ల మురళి పాల్గొన్నారు.

- అంబర్‌పేట

## అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ కోర్స్ విద్యార్థులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి, జూన్ 26 : అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ కోర్స్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థుల సమస్యలపై మూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ కళాశాలల్లో 800 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇప్పటికీ సరైన కోర్స్ సెలబస్ లేదని దీంతో మొదటి సంవత్సరం ఫలితాల్లో 97 శాతం మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఇంటర్‌లో టాప్ మార్కులు తెచ్చుకున్నటువంటి యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ఫెయిల్ అయ్యారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేవారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి, నాయకులు రమేశ్, శ్రీను, రఘు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి, తదితరులు

## కౌశిక్‌రెడ్డితో బీఆర్ఎస్ నాయకులు

బూడిద రవాణాలో 100 కోట్ల స్కాం విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేసిన సవాల్ మేరకు బంజారాహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్‌కుమార్ యాదవ్.

- అబిడ్స్




## సమస్యల పరిష్కారానికి కృషి



జెమినీ కాలనీలో పర్యటించిన బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

ముషీరాబాద్, జూన్ 26 : రాంనగర్ డివిజన్ జెమినీ కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ తెలిపారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి జెమినీ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు వీధి దీపాలు వెలుగడం లేదని, డ్రైనేజీ, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యలను ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.



## అభివృద్ధిని పనులను చేపట్టాలి

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ జీహెచ్ఎంసీ సర్కిల్ -12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్ రావును కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్ -12 కార్యాలయంలో డీసీతో జాఫర్‌ఖాన్ సమావేశం అయి బస్తీలు, కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు.

- మెహిదీపట్నం



డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ అన్నారు. మయానిర్‌పట్టి, కుద్బిగూడ, చెప్పల్‌బజార్, సునార్‌గల్లి, వీరన్నగుట్ట, నింబోలిఅడ్డా, బర్కత్‌పుర ప్రాంతాల్లో బుధవారం లో ప్రెషర్ సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, మల్లికార్జున్, సుభాష్ పటేల్, బాబు, వాసు, నాగరాజు, సూరి, రేణుక, కృష్ణ పాల్గొన్నారు.

- కాచిగూడ

## వ్యక్తి అదృశ్యం



కాచిగూడ, జూన్ 26 : ఎలహంక రైల్లో ప్రయాణిస్తున్న దుబాయ్‌కి చెందిన వ్యక్తి అదృశ్యమైనాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన మహ్మద్ యూసుఫ్ కుమారుడు మహ్మద్ ఫయాజ్ దుబాయ్‌లో ఫ్యాషన్ డిజైనర్. ఆరునెలల క్రితం దుబాయ్ నుంచి మల్కాజిగిరికి వచ్చాడు. మంగళవారం ఎలహంకలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లాడు. ఇంటికి రావడానికి ఎలహంక – కాచిగూడ రైల్లో ఏ-2 కోచ్‌లో వస్తుండగా దుబాయ్ నుంచి భార్య ఉదయం 4 గంటలకు ఫోన్ చేసింది. కాగా..ఫయాజ్ ఫోన్ తీయకపోడంతో అనుమానంతో అతడి సోదరుడు మహ్మద్ అహ్మద్‌కు సమాచారం అందించింది. అతడు మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

## రోడ్డు నడుమ.. ఎద్దుల తిష్ట

### వాహనదారులకు ఇబ్బందులు



కాచిగూడ,జూన్ 26 : కాచిగూడ నుంచి నింబోలిఅడ్డా మధ్య దర్గా సమీపంలో రోడ్డుపైనే ఎద్దులు తిష్ట వేసి ఉంటున్నాయి. పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే .. సమోసా పార్క్ ఎదురుగా ఉన్న మౌలానా ఆజాద్‌నగర్‌లోని దర్గా సమీపంలో రెండు నెలలుగా గుంపులుగా ఎద్దులు రోడ్డుపైనే తిష్ట వేస్తున్నాయి. వృద్ధులు, స్కూల్ పిల్లలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం ఓ వృద్ధురాలు ఆ దారి గుండా వెలుతుండగా ఆమెపై దాడి చేయడానికి ఎద్దులు దూసుకొచ్చయని స్థానికులు ఆరోపించారు. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా.. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

. చిక్కడపల్లి, జూన్ 26 : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా డెవలప్‌మెంట్ యాక్షన్ ఫర్ రూరల్ ఎన్విరాన్మెంట్ (డేర్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న యువకులు డ్రగ్స్ వద్దు.. వాడకం మానేయండి అంటూ నినాదాలు చేశారు. డేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సరస్వతి మాట్లాడుతూ.. యువత ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని, ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఏసీఎస్ డైరెక్టర్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న యువకులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సరస్వతి .




## అవగాహన ర్యాలీ..

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ దూల్‌పేట నందు జిల్లా మద్యనిషేధ మరియు ఆబ్కారి అధికారి సీహెచ్ విజయ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవగాహక కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

- అబిడ్స్

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిల్ పాత బస్తీ అధ్యక్షుడు ఎస్. రామకృష్ణ శాస్త్రి పాల్గొన్నారు. - అబిడ్స్




## బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 26 : బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య అన్నారు. మరో 10 రోజుల్లోనే ప్రారంభం కానున్న ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అమ్మవారి దేవాలయ నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. దేవాలయాల నిర్వాహకులు పోలీసులు సూచనలు, నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.



## శుభాకాంక్షలు



కర్నూలు శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన టీజీ భరత్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

- అబిడ్స్

## మరమ్మతులకు నోచుకోలే..



పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్విన జలమండలి శాఖా అధికారులు పనులు పూర్తయిన అనంతరం మరమ్మతులు చేయకపోవడంతో సమస్యలు ఎదరవుతున్నాయి. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఉప్పర్ బస్తీలో మార్చిలో సీవరేజీ పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. సంబంధిత అధికారులు గాని, కాంట్రాక్టర్ గాని మరమ్మతులు చేయకుండా వదిలేశారు. బోనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు స్పందించి అన్నపూర్ణ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కార్వాన్

## పనులు పూర్తి చేయాలి



పనులు సకాలంలో పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. సంజీవయ్య నగర్ బస్తీలో బుధవారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ డీఈ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌లతో కలిసి పర్యటించారు.

- చిక్కడపల్లి